# ధాన్యం రైతుకు దన్ను

- ఎన్నికలున్నా.. కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి
- నిర్మల్ జిల్లాలో 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



సాగు చేసిన వరి పంట

నిర్మల్ టౌన్, అక్టోబర్ 31 : వానకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఒక వైపు ఎన్నికల షెడ్యూల్ అమలవుతున్నా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారులను ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించడంతో నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రధానంగా సరస్వతి కెనాల్, గడ్డెన్న వాగు, స్వర్ణ, కడెంతో పాటు ఆయా గ్రామాల్లో గల సాగునీటి చెరువులు, బోర్ల కింద వరి సాగు చేసిన రైతులకు నీటి కొరత ఏర్పడ లేదు. దీంతో దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్‌లో లక్ష 20వేల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సంవత్సరం 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యానికి ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, బీ గ్రేడ్ రకానికి 2183 మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించింది.

**జిల్లాలో 220 ధాన్యం కొనుగోలు కేంద్రాలు..**

నిర్మల్ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 220 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ, పీఏసీఎస్, గిరిజన సొసైటీ, డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించిన ప్రభుత్వం ఇప్పటికే ముథోల్ నియోజకవర్గంలో ఆరు కేంద్రాలను ప్రారంభించింది. ధాన్యానికి తేమశాతం 17శాతం ఉండాలని, తప్ప, తాలి లేకుండా చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చేందుకు రైతులకు విస్తృతంగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రైతువేదికల వద్ద ఏఈవోలు సమావేశం నిర్వహించి వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులు, లైటింగ్, నీటి సౌకర్యం, తదితర వసతులు కల్పించే విధంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**జిల్లాలో పకడ్బందీగా కొనుగోళ్లు...**

నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. గతేడాది 110 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ సారి పది కొనుగోలు కేంద్రాలను పెంచి 220కి చేర్చాం. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి.

-ఎం.ఎ.అలీం, జిల్లా అధికారి

**కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషం**



కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మద్దతు ధర వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఏడాది వానకాలం, యాసంగిలో కోతల సమయంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించకుండా విక్రయ కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించుకునేందుకు అవకాశం కలుగుతోంది.

-బొంతల భోజారాం

# సమైక్యత ద్వారానే సమగ్రాభివృద్ధి

■ నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నిర్మల్‌టౌన్ : ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 31: దేశంలో అన్ని వర్గాల సమైక్యత ద్వారానే సమగ్రాభివృద్ధి సాధిస్తున్నామని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం నిర్మల్ కలెక్టరేట్ సమీకృత భవనంలో తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. దేశ ఐక్యమత్యం, సమగ్ర భద్రతను కాపాడానికి ప్రతిజ్ఞ చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అధికారులు ప్రభాకర్, అంజిప్రసాద్, శ్రీకళ, శ్రీనివాస్ రెడ్డి, జయంత్‌రావుచౌహాన్, కిషన్‌కుమార్, సుధీర్‌కుమార్, రమేశ్, హన్మండ్లు, సాయిబాబా, శ్రీలత పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతా దినోత్సవం



ధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞన చేయిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, అక్టోబర్ 31 : భారత దేశ ఐక్యమత్యం, సమగ్రతను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ ఐక్యమత్యం, సమగ్రత, భద్రతలను కాపాడడానికి పునరంకితం చేయడానికి కృషి చేయాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రిటర్నింగ్ అధికారి కార్యాలయం పరిశీలన**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి ,కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీవో స్రవంతి ఉన్నారు.

## మేరే మిట్టి మేరా దేశ్‌లో పాల్గొన్న కాత్లే శ్రీధర్ బృందం

ఇచ్చోడ, అక్టోబర్ 31: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 28, 29, 30, 31వ తేదీల్లో నిర్వహించిన మేరే మిట్టి మేరా దేశ్ అనే కార్యక్రమంలో సౌత్ కల్చర్ సెంటర్ వారి పిలుపు మేరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘానికి పిలుపు రావడంతో సంఘం డైరెక్టర్ మండల పరిధిలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ప్రముఖ ఆదివాసీ కళాకారులు కాత్లే శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ మొదటి ప్రదర్శనగా మా కొమ్ము కోయ నృత్యాన్ని నిర్వహించడం మాకు చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కళాకారులు, ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం కార్యదర్శి కాత్లే ఆనంద్, సభ్యులు రాజకుమార్, నాగరాజ్, బాలు, వెంకయ్య, లక్ష్మాయ్య, ముకేశ్, రామకృష్ణ, సునీత, స్వర్ణ, రాజేశ్వరి, బద్రమ్మ పాల్గొన్నారు.



ఢిల్లీలో పాల్గొన్న కాత్లే శ్రీధర్ బృందం

# మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలి

- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయకుమార్, ఐజీ(రిటైర్డ్) ప్రభాకర్ రావు
- ఉమ్మడి జిల్లా ఎస్పీలతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్ రావు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ పోలీస్ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్పీ కార్యాలయంలో పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మావోయిస్టు కదలికలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతి దశలో సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాకు అదనంగా కేటాయించిన కేంద్ర పారా మిలటరీ బలగాలను ఉపయోగించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఉపయోగించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచిస్తూ అక్రమ నగదు, మద్యం సరఫరా వంటి అనైతిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్పీ కే సురేశ్ కుమార్, వేణుగోపాలారావు ఎస్ఐబీ, ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, నిర్మల్ ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ అచ్చే శ్వరరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయ రాఘవన్, డీఎస్పీలు వెంకట రమణ, కరుణాకర్, రమేశ్, సీఐలు , ఎస్ఐలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికలపై అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్

ఇచ్చోడ, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవోలు, ఉపాధ్యాయులకు మూడ రోజుల నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం శిక్షణ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించే పీవో, ఏపీవో విధుల గురించి వివరించారు. పని చేసే నియోజకవర్గంలో ఒకటో శిక్షణ, కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గంలో రెండో శిక్షణ ఉంటుందన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో సమస్యలు ఏర్పడితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎంఈవో ఉదయ్‌రావ్ మాట్లాడుతూ సిరికొండ మండలానికి బుధవారం మధ్యాహ్నం 1 నుంచి 5.30 గంటల వరకు పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, సకాలంలో ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులు మహేందర్ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో మృతి

గుడిహత్నూర్, అక్టోబర్ 31 : గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో గరోలే లక్ష్మణ్ (39) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గరోలే లక్ష్మణ్ సోమవారం మధ్యాహ్నం కూలి పని ముగించుకొని ఇంటికి వచ్చాడు. ప్రతి రోజూ మాదిరిగా లక్ష్మణ్ ముఖంకడిగి టావెల్ ఇంట్లోని ఇనుప దండెంపై వేస్తుండగా కరెంట్ షాక్ తగిలి కింద పడి పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయన భార్య గరోలే అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.